లస్కర్‌మాంకాలమ్మమీదొట్టు. దేవర లంబాడీ తళజా మీద ప్రమాణం. యీరబెమ్మంమీద ఆన. ననుగన్న కుమ్మరి కోటమ్మమీదొట్టు. అయ్యలార, అమ్మలార అంతా నిజ ం చెబుతాను. అస్సలు అబద్ధం చెప్పను.

అబ్రాహ్మణులకూ, అతివలకూ ఆకలులకూ జరిగినప్పుడు నిరసనగా ప్రవహించిన వూరేగింపుల్లో ప్రవహించాను. పదిహేను వర్షాలుగా యిదేపనిలో వున్నాను. నేడు నాకు జరిగింది. యెవడు చేశాడో యెవతి చేసిందో కోటి నిజనిర్ధారణ కమిటీలు తేల్చడం లేదు. లోకులు గుసగుసలు పోతున్నారు. నా భార్యనే చేసిందని కొందరు, వూరివాళ్లని కొందరు, నేనే చేసుకున్నానని మరికొందరు. యెవ్వడూ కనికరించడం లేదు నన్ను.

నొప్పి. మంట. రెండు తొడలమధ్యనుండి రుధిర వరదలు.

★ ★ ★ ★

నేనేనా, ఆకాశంలో సగంకాదు ఆకాశమే ఆమెన్న
నేనేనా, దేహవృత్తి మహా పాపమని నాటకాల్రాసిన
నేనేనా. ఆమె నాతో పడుకోవాలన్న పలవరింతను
ఆమె భర్త చెవిలో వేసిన మూర్ఖపు నేనేనా.
బ్రహ్మప్రాప్తి భ్రమ సమాప్తి వొక్క వొకే వొక్క
ఆమెతోనే అని మనసా దేహ నమ్మిన నేనేనా
. అపరాత్రి గతదినం గోదావరెక్కింది.
రాజమంద్రొచ్చింది.


★★★

ప్చ్. యేం నములుతున్నావ్
బియ్యం
యెందుకు
యిదడగడానికొచ్చావా
వాసనొస్తుంది
సారా తాగాను
రోజూ తాగుతావా
అవును. నొప్పి భరించడానికి
మరి బియ్యం
మీకు వాసనరాకుండా వు ండడానికి
నీ పేరు
యెందుకు
నీ గురించేదైనా చెప్పు
యెందుకు. పెండ్లి చేసుకుంటావా
నాకు పెండ్లైంది
ముందు పనికానియ్. మానాన్న తలుపు కొడతాడు
మూడొందలు తీసుకున్నాడుగా
నువ్వొచ్చి ముప్పావుగంటైంది. యింకా పావుగంటే వుంది
నీ కళ్లు చాలా బాగున్నాయి
థాంక్స్. కబుర్లేనా, యింకేమైనా వుందా
నాతో హయిదరాబాదొస్తావా
యెందుకు
యీ పని మానేసి వుద్యోగం చేద్దువుగానీ
నన్ను లేపకపోదామని వొచ్చావా
కాదు
నాకు చదూరాదుగా
చదువవసరంలేని వుద్యోగాలుంటాయి
అగో. నాన్న తలుపుకొట్టాడు. నేనెల్లిపోతున్నాను.
ప్లీజ్
చెయ్యొద్దులు
మా నాన్న లేటైతే బెల్టుతో కొడతాడు. నేను మీ దగ్గర డబ్బులు తీసుకొని ఆయనకివ్వనని అనుమానం.
యింకో మూడొందలిచ్చిరానా
యివ్వు నేనిచ్చొస్తాను
(                )
యింకో గంటవరకు మా నాన్న మాట్లాడ్డు
నాకు నీతో మాట్లాడాలనివుంది
నాకు లేదు
యెందుకు
నీ పండ్లు చాలా అందంగా వున్నాయి
నా భార్యకూడా మొదటిరాత్రి యిదేమాటంది
..........................
నాతో మాట్లాడాలని యెందుకు లేదు
మేం కస్టమర్లతో మాట్లాడం
మీరు మాట్లాడరా. కస్టమర్లు మాట్లాడ నివ్వరా
రెండూ
నీ మెడకింది పుట్టుమచ్చమీద ముద్దుపెట్టుకోనా
అందుకేగా ఆరొందలిచ్చావ్
ప్చ్
అదేంటి. యేడుస్తున్నావే. నేనేద్పేమగాళ్లను నమ్మను
యెందుకు
నా దగ్గర కొచ్చేవాళ్లలో తాగొచ్చేవాళ్లు మాత్రమే యేడుస్తారు. వాళ్ల పెండ్లాలమీద చాడీలు చెపుతారు కొందరు తాగినప్పుడు మాత్రమే నిజం మాట్లాడగలరు

# కేస్ట్రేషన్

—దెంచనాల శ్రీనివాస్





యేడుపాపి, రా
నా భార్య గుర్తుకొచ్చింది
ఖర్మ. నీదీ అదే టైపా. చనిపోయిందా
కాదు
మరి
లేచిపోయింది
యెందుకు
నేనామెను సుఖపెట్టలేదని వుత్తరం రాసింది
యే సుఖం
యేరకమైన సుఖమూ యివ్వలేదట
నువ్వు కొజ్జావా
యేమో. నాకొక కూతురు
మరి
నేనిస్తున్నది ఆమెకు సరిపోవడం లేదట
నీ వయస్సెంత
ముప్పై
ముప్పైయేనా
అవును. యేం
మరి యిలావున్నావేం. బట్టతల. నలభైయేండ్ల వాడిలా
దురదృష్టం
యీ వయసులో ఆమెను తృప్తిపరచలేవా
తృప్తి పరచాలనే నేనామె చెంతకు చేరతాను. ఆమె స్పర్శ నా మెదడుకు విశ్రాంతి కలిగించదు
యెందుకు. ఆమె అందంగా లేదా
ఆమె నీ కంటే అందమైంది
మరి
నా మెదడు కమ్మరికొలిమిలా కాలుతూ వుంటుంది.

కోటానుకోట్ల ఆలోచనలతో
నేను చల్లబడాలని ఆశగా ఆమెవద్దకు చేరుతాను. అయినా ఆ ఆలోచనలు బుసలు కొడుతూ విషం వర్షిస్తుంటాయి నా మెదడులో
నా చిన్నపుడే అమ్మ కిరోసిన్ పోసుకొని కాలిపోవడం.
నా మొదటి పదేండ్లలో
దొరల కాళ్లకింద లంబాడీలు గాయపడడం.
రెండో ఆట తరువాత భార్యతో నడుస్తున్నప్పుడు వాళ్లు నన్ను కొట్టినప్పుడు నా అండర్‌వేర్ తడువడం. నా పెండ్లయిన మొదటిరాత్రి యింటిముందు ఆరుగురూ యెండ్రిన్ తాగడం. ముసుగువ్యక్తులు ముగ్గురు నా తమ్ముని తల నరికి కాలేజి బురుజుకు వేలాడదీయడం, టైముకు స్నానం చేయలేదని అయిదేండ్ల నా పాప మీదికి నా భార్య అట్లకాడ విసిరితే కనిగుడ్డు చిట్లడం. నా భార్య నన్ను పదే పదే కొజ్జా అని పిలవడం.

పిచ్చివాడ. యేడవకు. యీ లోకం నెత్తురులో మునిగివుంది. ఆ నెత్తుటి-లోనే నువ్వు పువ్వులు యేరుకోవాల్సి వుంది.
ఆమెకు చీకటి కావాలి. నాకు వెలుతురు కావాలి. ఆమె నగ్న దేహం, భగవంతనివలె నా కింత వరకూ సాక్షాత్కారం కాలేదు. నీటిపై నూనె తెట్టెల్లా, కాన్వాసుపై వొలికి పోయిన వేయిరంగుల్లా, మరకలు మరలుగా ఆమె నగ్నత్వాన్ని వూహించుకుంటూ, వుడుకుతున్న మెదడును వూరడించు కుంటూ, నా మనో వైకల్యానికి నేనే చింతిస్తూ అయిష్టమైన చీకటిలోనే ఆమె చెంతకు చేరుతాను. 'మమ్మీ' అని పిలుస్తాను. పలుకదు. పదే పదే పిలుస్తాను. ఆబగా ఆకలిగొన్న తొడేలు గొర్రెపై పడ్డట్టు నన్ను తనపైకి లాక్కుంటుంది. నేను తనతో నా దుఃఖ మాటలు పంచుకోవాలనుకుంటున్న సమయంలో, నేను యుద్ధానికి సిద్ధం కాకమునుపే నాపై ఖడ్గచాలనం చేస్తుంది. నేను వోడి పోతాను.
మళ్లీ వెయ్యిన్నొక్కసారి 'కొజ్జాలంజోడక' అని బొడ్డు కింద తన్ని వెళ్లి పాపపక్కలో పడుకొని నిద్రలోకి జారుకుటుంది. యేడుస్తూ. నేను కుండపోతగా దుఃఖిస్తాను. నిద్ర పట్టదు. తెల్లారేవరకూ ముక్కలు ముక్కలుగా విడిపోతూవుంటాను. కమ్మరి యెల్లిగారం యినుమును అతికించినట్టు, నాపాపో మరేదో అతీంద్రియశక్తో అతికిస్తుంది నన్ను మళ్లీ. కళ్లమంటలు, కడుపునొప్పి, బంక విరేచనాలు. రోజూ. రోజూ.......
పిచ్చితండ్రీ. యేడవకు. యిలారా. నా నగ్నదేహమ్మీద విశ్రాంతి తీసుకో. ప్చ్. ప్చ్. నా చిన్నికన్నా నిన్ను తన్నిందంటే నమ్మలేనుకానీ ఆమె లేచిపోవడం సరైనదే. దేహ దుఃఖాలు తీర్చని పురుషుణ్ణుంచి యేస్త్రీ అయినా విడిపోవాలనే కోరుకుంటుంది. కొందరు ధైర్యవంతులు, జీవితాన్ని వెలిగించుకోవాలని కోరుకునే వాళ్లు మరొక యిష్టమైన పురుషునితో లేచిపోతారు. లేదా పెండ్లి చేసుకుంటారు. భయస్తులు, లోకాన్నిచూసి కంపించేవాళ్లు ఆ జన్మాంతం నరకాన్ని అనుభవిస్తుంటారు.

నాలా
యీ చిన్న కరెంటు బలుబు వెలుతురులో నీ నగ్నదేహాన్ని పూర్తిగా చూడలేకపోతున్నాను
వుండు ట్యూబ్‌లైట్ వేసొస్తాను
(                )
పాలనురుగు సముద్రంలాంటి యీ సంపదను యెందుకు నరకకూపంలో బంధించు కున్నావు
అదొక కథ. నీ కథకంటే కడువిచిత్రమైన కథ. నేను మనసు విప్పితే యీ భూమి కన్నీటి పిడుగులతో బద్దలయ్యే కథ. యెక్కువ శాతం పురుషుడే స్త్రీ దుఃఖానికి మూలకారకుడు. నీ భార్య విషయంలో పురుషుడు? నావిషయంలో తండ్రి. అంతే తేడా
మరి పురుషుని దుఃఖానికి ?
అగో, నాన్న తలుపుకొడుతున్నాడు. మీదినుంచిలే. నువ్వు మళ్లీ వచ్చినప్పుడు నీదేహ ప్రశ్నలకీ మనో ప్రశ్నలకీ సమాధానాలు చెపుతాను. వెళుతున్నాను. సారీ. ప్చ్. ప్చ్. ప్చ్.

★★★

నొప్పి. మంట. రెండు తొడలమధ్య నుండి రుధిర వరదలు. అంతా అబద్ధం. అబద్ధం. అబద్ధం. ★

వచ్చేవారం కథ:

## జలగలవార్డు

-గొరుసు జగదీశ్వరరెడ్డి